# వైభవంగా శ్రీ వల్లేలాంబ దేవి రథోత్సవ వేడుకలు..!

- వేడుకల్లో పాల్గొన్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి



**కోడుమూరు,మార్చి 22, ప్రభాతవార్త :** కోడుమూరు పట్టణ హంద్రీ నది ఒడ్డున వెలసిన శ్రీ వల్లేలాంబ దేవి తిరుణాల రథోత్సవ వేడుకలు బుధవారం సాయంత్రం వైభవంగా సాగాయి. ఈ వేడుకల్లో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ వేడుకలను తిలికించేందుకు ఆయా గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలి వచ్చారు. ఈ నెల 19వ తేది నుంచి ప్రారంభమైన అమ్మవారు ఉత్సవాలు ప్రతి రోజు అమ్మవారికి విశేషంగా పూజలు గావిస్తున్నారు. ఉగాది పండుగ దినం సందర్భంగా ఇక్కడ ప్రతి ఏటా జాతర ఉత్సవాలను ఆలయకమిటి వారు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా అమ మ్మవారం ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. రథోత్సవ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కోడుమూరు సిఐ శ్రీధర్,కోడుమూరు,గూడూరు,సి.బెళగల్ ఎస్.ఐలు విష్ణునారాయణ,నరేంద్ర,పీరయ్యలు గట్టి పోలీసు బందోబస్తును నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటి అధ్యక్షుడు బరుసు రఘునాథ్‌రెడ్డి,శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ కమిటి అధ్యక్షులు ఎద్దుల మహేశ్వరరెడ్డి,ఎద్దుల సూర్యారెడ్డి,సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, రవి కుమార్‌రెడ్డి, రమేష్‌నాయుడు,కరెంట్ మల్లారెడ్డి, నల్లశ్రీను, సాలన్న,బి.వెంకటేశ్వర్లు,శ్రీనివాసులు,పూలవాసు,రవికాశన్న తదితరులు పాల్గొన్నారు.

**శ్రీగిరిక్షేత్రంలో ఉగాది మహోత్సవముల సందర్బంగా నాల్గవవరోజైన బుదువారంనాడు శ్రీస్వామిఅమ్మవార్లకు ప్రత్యేకపూజలు జరిపించబడ్డాయి.ఆ తరువాత ఉదయం గం.8.00 నుండి స్వామివారి యాగశాలలో చండీశ్వరపూజ,మండపారాధనలు,లోక కల్యాణం కోసం జపానుష్టానాలు రుద్రహోమం నిర్వహించబడ్డాయి.అదే విధంగా ఉదయం 9.00గంటల నుండి అమ్మవారి యాగశాలలో చండీహోమం జరిపించ బడ్డాయి. ఉత్సవములో భాగంగా అమ్మవారికి విశేషకుంకుమార్చనలు, నవావరణా ర్చనలు చేయడం జరిగింది.కాగా సాయంత్రం 5.30గంటలకు సాయంకాల పూజలు,జపానుష్టానములు జరిపించబడ్డాయి.**

• వివరాలు 2లో

శ్రీశైలంప్రాజేక్టు, ప్రభాతవార్త :





# కన్నుల పండువగా.. మల్లన్న రథోత్సవం..!

# ప్రేమతో కొట్టుకుందాం రా..!

- నేడు ప్రేమకోసం పిడకల సమరం..
- ఆనవాయితీగా ఇది కైరుప్పలలో ఆచారం
- స్వామి వారిపై ఉన్న భక్తితోనే..


**మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో నేడు గురువారం పిడకల సమరానికి సై..అంటూ ప్రేమతో పిడకలతో కొట్టుకుందాం..రా..అంటున్నారు. ఇది కైరుప్పల గ్రామంలో ఆనవాయితీగా వస్తున్న ఆచారం. పిడకల సమరం ప్రేమికులను కలపడం ఏమిటని అనుకుంటున్నారా..?ఇది నిజమేనని చెబుతున్నారు. కైరుప్పల గ్రామస్తులు తమ ఇష్టదైవాలను కలిపేందుకే పూర్వం తమ గ్రామస్తులు ఈ యుద్ధం సాగించినట్లు వివరిస్తున్నారు. ప్రతి ఏటా ఉగాది సందర్బంగా ఈ ఉత్సవాలను భక్తిశ్రద్దలతో నిర్వహిస్తారు.**





**ఆస్పరి,మార్చి 22,ప్రభాతవార్త**
విహారయాత్రకు వెళ్లి వీరభద్రస్వామి తనను తారాన పడిన కాళికాదేవిని వివాహం చేసుకుంటానని మాటిచ్చాడంటా.. అయితే ఆ తర్వాత స్వామి మాటతప్పడంతో కాళికాదేవి వర్గీయులకు తీవ్ర ఆగ్రహం కలిగించింది. తమకు అందుబాటులో ఉన్న పిడకలతో స్వామి వారి వర్గీయులపై దాడికి దిగారు. వీరభద్రస్వామి వర్గీయులు కూడ పిడకలతో ఎదురుదాడికి దిగారు. ఇరువర్గాల మధ్య ఈ దాడి ప్రతి దాడికి రణరంగాన్ని తలపించింది. అయితే నిమ్మకులానికి చెందిన కాళికాదేవికి అగ్రవర్ణాలకు చెందిన వీరభద్రస్వామితో గ్రామపెద్దలు పంచాయతీ పెట్టి వివాహం చేశారని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రాణాలకు తెగించి తమకోసం పోరాడిన తమవర్గీయులకు వీరభద్రస్వామి,కాళికాదేవిలు కోరిన కోరికలు తీర్చినట్లు స్థలపురాణం చెబుతుంది. ఆనాటి నుండి నేటివరకు వీరభద్రస్వామి,కాళికాదేవి ప్రేమవ్యవహారం కారణంగా భక్తులు పిడకల జరుపుకోవడం ఆచారంగా వస్తుంది.

**సమరం ఇలా సాగుతుంది :**



# కలెక్టరేట్‌లో ఘనంగా ఉగాది వేడుకలు..



**నంద్యాల, మార్చి 22, ప్రభాతవార్తః** శ్రీశోభకృత నామ సంవత్సర ఉగాది వేడుకలు కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. సిద్ధాంతికరణ సుధీంద్ర ఆచారి అధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, డిపిఆర్ఓ మల్లిఖార్జున, డిఎం అండ్‌హెచ్ఓ డా.వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, దృశ్యకలల అకాడమి డెరెక్టరు సునీత అమృతరాజ్, కలెక్టరు సీసీ బివి నాగేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు, అనాధికారులు పాల్గొన్నారు. ముందుగా కలెక్టరేట్ కార్యా లయం నుంచి మేళ తాళాలతో దేవున్ని ఊరేగింపుగా కలెక్టరు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని కొనసాగించారు. అనంతరం కార్యాలయంలో జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. జిల్లాలో ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసే పర్వదిన పండుగ ఉగాది పండుగ అని జీవన గమణంలో కష్టసుఖాలు సహజమే అన్న సత్యాన్ని గుర్తెరిగి, ఆరు రుచులు మేళవించిన ఉగాది పంచడి ద్వారా సాంప్రదాయాలను గౌరవిస్తు ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని అకాంక్షించారు. ఈతెలుగు సంవత్సరం జిల్లాలోని అందరి కటుంబాల్లో అందరికి పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ప్రతి ఇల్లు సంక్షేమ సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని కోరారు. జిల్లాలో సమృద్దిగా వర్షాలు కురిసి సిరుల పంటలు పండాలని అందరి భాగస్వామ్యంతో అభివృద్దిలో నంద్యాల జిల్లా ముందడుగు వేయాలని అకాంక్షించారు. శ్రీశోభకృత్ నామసంవత్సరంలో ద్వాదశ రాశుల వారికి ఆదాయ వ్యయ రాజపూజ అవమానాలను పలికించారు. 12 రాశులకు సంబంధించి ఆదాయం 105 ఉండగా వ్యయం 96గాను, రాజపూజ్యం 45 గాను, అవమానం 51 గాను ఉందని సిదా ్ధంతి పేర్కొన్నారు. సిద్ధాంతికరణ సుధీంద్ర అచారి పంచాంగశ్రవణం చేశారు. అర్చక స్వాములను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. కన్నులపండువగా జరిగిన ఈవేడుకలు తిలకించేందుకు పట్టణ ప్రజలు తరలివచ్చారు.

# కారు-ఆటో ఢీ..

- ముగ్గురికి తీ వ్ర గాయాలు

కౌతాళం, మార్చి22, ప్రభాతవార్త ; కౌతాళం-ఆదోని రహదారిలోని రాజ నగర్ వద్ద బుధవారం తెల్లవారు జామున కారు-ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.



## శ్రీమఠంలో ఘనంగా..
# ఉగాది పర్వదిన వేడుకలు..!

- తులసిపూజ చేసిన పీఠాధిపతి
- భక్తులతో కిటకిటలాడిన శ్రీమఠం



**మంత్రాలయం,మార్చి 22,ప్రభాతవార్త :**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో శ్రీ శోభనామాకృత నామ సంవత్సర ఉగాదిపర్వదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి.శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా శ్రీ రాఘవేంద్రస్వామి బృందావనానికి వేకువజామునుండే ప్రత్యేక పూజలు నిర్వహించారు.సుప్రభాతసేవ,నిర్మల విసర్జన సేవ,రాయర పాదపూజ,అష్టోదకం,కనాకాభిషేకం,పల్లకిసేవ,ఊంజలసేవ,మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు.అనంతరం ప్రత్యేక పూజల్లో భాగంగా శ్రీ మూలరాములకు,శ్రీ ప్రాణదేవునికి,శ్రీ రుద్రదేవునికి,శ్రీ మంచాలమ్మకు,శ్రీ రాయరకు మరియు మిగిలిన బృందావనాలకు తైల అభ్యంగణ స్నానం,మహా మంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు.అదేవిధంగా తలుసిపూజ,గోపూజ,నారీకృత నీరాజన తదితర పూజలు నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు.అనంతరం తరలివచ్చిన భక్తులకు పీఠధిపతి తెలుగు నూతన సంవత్సర అనుగ్రహ సందేశాన్ని ఇచ్చారు.ఈ వేడుకల్లో ఏపి నుండే కాక కర్ణాటక,తెలంగాణ,మహారాష్ట్ర,తమిళనాడు,కేరళ తదితర రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందారు.ఈ వేడుకల్లో స్వామివారిని దర్శించుకోవడానికి అధిధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో శ్రీమఠం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పండిత కేసరి రాజాఎస్ గిరియాచార్,ఏఏఓ మాధవశెట్టి,జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచారి,మేనేజర్‌లు ఎస్‌కె శ్రీనివాసరావు,వెంకటేష్ జోషి,అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి,పిఆర్ఓ వ్యాసరాజాచారి, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాగిజావ పంపిణీలో గందరగోళం..!



**కోసిగి, మార్చి 22, ప్రభాతవార్త**
పాఠశాల విద్యార్థులకు మంగళవారం నుంచి రాగిజావను పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే రాగిజావ తయారు చేయడానికి వంట మనుషులను ఎలా సిద్ధం చేసుకోవాలి వంటి వాటిపై ఉన్నత స్థాయి నుంచి ఎలాంటి స్పష్టత రాలేనట్లు తెలుస్తోంది.. దీంతో ప్రధానోపాధ్యాయుల్లో గందరగోళం నెలకుంది. వారంలో మూడు రోజుల పాటు పంపిణీ చేయాలని ఖరారుతో పాటు దాని తయారీకి అవసరమైన రాగిపిండి, బెల్లం మాత్రమే పాఠశాలలకు పంపారు.. విద్యార్థులకు దాన్ని సకాలంలో తయారు చేసి ఇవ్వటానికి సంబంధించి వంట మనుషులు, టీచర్ల భాగస్వామ్యం గురించి తెలియజేయక పోవడంతో అటు ప్రధానోపాధ్యాయుల్లో, ఇటు ఉపాధ్యాయుల్లో అయోమయం నెలకుంది.. పిల్లలు ఇప్పటి వరకు పాఠశాలలకు కేవలం తమ వెంట మంచినీటి బాటిల్స్‌ను మాత్రమే తెచ్చుకుంటున్నారు.. భోజనం చేయడానికి పాఠశాల ల్లోనే ప్లేట్లు ఉంటున్నాయి. విద్యార్థులే ఇంటి నుండి గ్లాసులు తెచ్చుకుంటే తప్ప రాగిజావను పంపిణీ చేయలేరు.. గ్లాసులు కడుక్కోవటానికి సరిపడ్డ నీళ్లు పాఠశాలల్లో ఉండవు..కొన్ని చోట్ల మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా తాగటానికి మాత్రమే నీరు అందుతున్నాయి.. దీంతో ప్రభుత్వం నీటి సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది..

**రాగిజావ ఎలా పంపిణీ చేయాలి:**
రాగిజావ వేడికి స్టీల్ గ్లాసు తప్పనిసరిగా అవసరం.. ఒకవేళ విద్యార్థులు ఇంటి నుంచి స్టీల్ గ్లాసు తెచ్చుకోకపోతే ప్లాస్టిక్ లేదా పేపర్ గ్లాసులను ప్రభుత్వం ఇస్తే తప్ప దాన్ని అందరు విద్యార్థులకు పంపిణీ చేయలేని పరిస్థితి.. కానీ పాఠశాల విద్యాశాఖ నుంచి ఇప్పటి వరకు వీటికి సంబందించి ఎలాంటి ఆదేశాలు వెలువడలేదు.. దీంతో గ్లాసులు రాకపోయే సరికి హెచ్‌ఎంలు ఆందోళన చెందుతున్నారు.. జావ వేడడికి పేపర్ గ్లాసు, ప్లాస్టిక్ గ్లాసులు లీక్ అవుతాయని వాటిల్లో పోయడం కష్టమని మరోవైపు ఆందోళన చెందుతున్నారు.. వేడివేడి జావ జారిపడినా, లేక లీకై పడినా విద్యార్థి శరీరం కాలుతుంది.. వీటన్నింటి దృష్ట్యా రాగిజావ పంపిణీ విషయంలో అనేక జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని అంటున్నారు..

**పాఠశాల ప్రార్థనకు ముందే రాగిజావ:**
పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం తయారు చేసినందుకు ప్రభుత్వం వంట మనిషికి రూ. 3వేల చొప్పున గౌరవ వేతనం మాత్రమే ఇస్తున్నారు.. పప్పులు, నూనె, కూరగాయలు తదితర వాటి కోసం ఒక్కో విద్యార్థికి రూ.8 చొప్పున చెల్లిస్తున్నారు.. దీంతో వంట మనుషులే బియ్యం మినహా మిగిలిన అన్ని సరుకులు తీసుకొచ్చి మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నారు.. వారు ఉదయం 9.30 గంటలకు వచ్చి 12 గంటల్లోపు వంటను సిద్ధం చేస్తారు.. ఆ తర్వాత ఉపాధ్యాయుల సమక్షంలో పిల్లలకు భోజనం వడ్డిస్తారు..అయితే రాగిజావను మాత్రం ఉదయం ప్రార్ధనకు ముందు అంటే ఉదయం 8.45 గంటలకే విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆదేశాల ఇచ్చారు.. దీంతో ఉదయం 8 గంటలకే వంటమనిషి వస్తేకానీ రాగిజావ సిద్ధం చేయలేరు.. అంతేకాక పెద్దపెద్ద పాఠశాలల్లో అయితే మరీ కష్టం..ప్రస్తుతం టీచర్లు 9గంటలకు బడులకు చేరుకుంటున్నారు.. వచ్చి రాగానే ముఖ హాజరు నమోదు చేస్తున్నారు.. టీచర్ల భాగస్వామ్యం లేకుండా పిల్లలకు రాగిజావ పంపిణీ చేయలేమని, అలా ఇవ్వాలంటే వారు అరగంట ముందే బడికి రావాల్సి ఉంటుంది.. వీటన్నింటిపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని హెచ్‌ఎంలు కోరుతున్నారు.. పాఠశాలల్లో రాగిజావ పథకం ఏ మేరకు విజయవంతమవుతుందో వేచి చూడాలి ్సందే మరి..

**“పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు జగన్ సర్కార్ రాగిజావ పథకాన్ని అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంది.. ఇందులో భాగంగా వారంలో మూడు రోజులు అంటే మంగళవారం, గురువారం, శనివారంలలో ఈ రాగిజావను పాఠశాలలో జరిగే ప్రార్థనకు ముందే పిల్లలకు అందించాలి.. గతంలో ఈ పథకం పలుమార్లు వాయిదా పడగా, ఎట్టికేలకు ర్రాష ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు పాఠశాల విద్యార్థులకు మంగళవారం నుంచే రాగిజావను పంపిణి చేసారు.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కో విద్యార్థికి 150 గ్రాముల ప్రకారం జావను పంపిణీ చేసారు.. అయితే ఈ రాగిజావ తయారీకి సంబందించి సరైన మార్గదర్శకాలు, శిక్షణ లేకపోవడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారు.. రాగిజావ తయారు, పంపిణీ, గ్లాసులు తదితర అంశాలపై నేటి వరకు ప్రభుత్వం నుండి స్పష్టత కనిపించడం లేదు”..**

- రాగిజావ తయారీపై కొరవడిన అవగాహన..
- పాఠశాల ప్రధానోపాధ్యాయుల్లో అయోమయం..
- రాగిజావ తయారీకి మార్గదర్శకాలు, శిక్షణలపై కనిపించని స్పష్టత..
- ప్రార్థనకు ముందే రాగిజావ పంపిణీ..
- వారానికి మూడు సార్లు విద్యార్థులకు అందజేత..

## పండక్కి ఊరెళ్లితే ..
# ఇల్లు గుల్లా..!

- తాళాలు వేసిన ఇళ్లల్లో చోరీ..
- రంగంలోకి క్లూస్ టీమ్..

2లో





# కన్నుల పండువగా మల్లన్న రధోత్సవం..

**తరువాయి.. కన్నుల పండువగా మల్లన్న రధోత్సవం:** ఉగాదిమహోత్సవాలలో భాగంగా బుదువారం సాయంకాలం రదోత్సవంలో సంప్రదాయాన్ని అనుసరించి ముందుగా రధాంగపూజ, రధాంగహోమం, రధాంగబలి,కార్యక్రమాలు జరిపించబడ్డాయి. రధాంగ బలిలో వసంతంతో నింపిన గుమ్మడికాయలు, కొబ్బరికాయలు,కుంభం(అన్నరాశి)సాత్వికబలిగా సమర్పించబడ్డాయి.తరువాత శ్రీస్వామిఅమ్మవార్ల రధంపైకి వేంచేబు చేయించి రధోత్సవం జరిపించబడింది.ఈ రధోత్సవ దర్శనం వలన సర్వపాపాలు తొలగిపోతాయని, కోరిన కోరికలు నెరవేరుతాయని చెప్పబడుతోంది.కాగా రధోత్సవం సందర్భంగా రధానికి విశేషంగా పుష్పాలంకరణ చేయడం జరిగింది. రధోత్సవంలో కోలాటం,చెక్కభజన,జానపద పగటివేశాల ప్రదర్శన,కేరళ కథాకేళి,తప్పెట చిందు,కర్ణాటక జాంజ్,వీరగాసీ,కొమ్మువాయిద్యం,కన్నడ జానపద దడోలు, నందికోలుసేవ,మొదలైన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది.

**రమావాణీసేవిత రాజరాజేశ్వరీ అలంకారం:** ఉగాది ఉత్సవాలల్లో చేయబడే శ్రీఅమ్మవారి అలంకారంలో భాగంగా బుదువారంనాడు అమ్మవారి ఉత్సవమూర్తికి రమావాణీ సేవిత రాజరాజేశ్వరీ అలంకారం, అలంకారమూర్తికి విశేషపూజలు జరిపించబడ్డాయి. చతుర్భుజాలు కలిగిన ఈ దేవి పాశం,అంకుశం, పద్మం,చెరుకుగడను ధరించి దర్శనం ఇచ్చారు.ఈ దేవిని దర్శించడం వలన కోరికలు నెరవేరుతాయని, సమస్యలన్నీ తొలగిపోతాయని చెప్పబడుతోంది.

## పండక్కి ఊరెళ్లితే ..ఇల్లు గుల్లా..

**కోసిగి, మార్చి, ప్రభాతవార్త :** ఉగాది పర్వదినంకు సంబందించి అమావాస్య నాడు దేవుని దర్శనార్థం తమ ఇంటిల్లిపాదు ఊరెళ్లి వచ్చి చూసేసరికి ఇల్లు గుల్లా అయిన సంఘటన కోసిగిలో బుధవారం చోటు చేసుకుంది. రౌదూరులోని బెట్టప్ప తాతా సన్నిదిలో పవిత్రులుగా మారితే.. ఇక్కడ ఇంట్లో మాత్రం దొంగలు జొరబడి ఇంటిని గుల్లా చేసారని బాదితుడు మాల నరసింహులు ఆవేదన వ్యక్తం చేసాడు. వివరాల్లోకి వెళ్లితే..కోసిగిలోని ఊరు వాకిలి సమీపంలో నివాసం ఉంటున్న మాల నరసింహులు విద్యుత్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.. కాగా ఉగాది పర్వదినం ముందురోజు వచ్చిన అమావాస్య సందర్భంగా తమ ఇంటి దేవుడు కౌతాళం మండలం రౌదూరులో వెలసిన బెట్టప్ప తాత గుడికి కుటుంబీకులు దర్శనార్థం వెళ్లారు..ఇంటికి తాళాలు వేసి చుట్టుపక్కల వారికి చెప్పి వెళ్లారు.. అయితే వీరు వెళ్లి రాత్రే దొంగలు ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు.. ఇంటి తలుపులు పగులగొట్టి, గొళ్లెంను విరిచినట్లు గమనించిన ఇంటి పక్కల వారు వెంటనే ఇంటి యజమాని మాల నరసింహులుకు సమాచారం అందించారు.. విషయం తెలుసుకున్న నరసింహులు హుటాహుటిన కోసిగి చేరుకుని అనుమానంతో తలుపులు తెరుచుకుని ఇంట్లో వెళ్లి చూడగా సామాన్లు, బట్టలు, విలువైన దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.. అలాగే బీరవాను తెరచి చూడగా అందులో ఉన్న రూ.50వేలు నగదు, రెండు జతల బంగారు చెవి దుద్దులు, నెక్లెస్, బంగారు గొలుసులు కనిపించలేదు. ఇవన్నీ అపహరణకు గురైనట్లు గమనించాడు. రూ.50వేలు నగదుతో పాటు 5 తులాల బంగారం చోరికి గురైనట్లు గమనించాడు. దీంతో వెంటనే చోరీ సమాచారాన్ని పోలీసులకు తెలియజేసాడు. విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ రాజారెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దీంతో ఎస్ఐ రాజారెడ్డి వెంటనే క్లూస్ టీమ్‌కు సమాచారం ఇవ్వడం జరిగింది.. వారు వచ్చి దొంగతనం జరిగిన పరిస్థితిని గమనించి అనుమానం ఉన్న చోటేల్లా శోధించారు.. ఈ సందర్భంగా ఎస్ఐ రాజారెడ్డి మాట్లాడుతూ ఎవ్వరైనా ఊర్లకు వెళ్తొంటే సమాచారాన్ని తమకు అందించాలని, అలాగే చోరి జరిగిన పరిస్థితిని గమనిస్తే ఇంటి పరిసరాలు తెలిసిన వారే ఇలా చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందని, త్వరలో ఈ చోరీని ఛేదిస్తామన్నారు.

## ప్రేమతో కొట్టుకుందాం రా..!

**తరువాయి..** పుప్పాలదొడ్డి,చెన్నంపల్లి,వెంగలాయదొడ్డి,కారుమంచి,కల్లపరి,బిల్లేకల్లు తదితర గ్రామాల ప్రజలు తమ కోరికలు తీర్చిన వీరభద్రుడికి మొక్కుబడి సమర్పించేందుకు నెల నుండి తమ ఇంట్లో ఉన్న పశువుల పేడతో పిడకలు తయారు చేస్తారు. వాటిని ఉగాది మరుసటి రోజు దేవుడి సన్నిదానానికి చేరుస్తారు. భక్తులు రెండు వర్గాలుగా విడుపోయి పిడకలతో కొట్టుకుంటారు. దెబ్బలు తగలకుండ గోనసంచులు ముసుగు వేసుకుంటారు. ఈ పిడకల సమరం అరగంటపాటు వేలాది మంది భక్తుల నడుమ సాగుతుంది. భక్తులు గాయాలకు గురవుతారు. గాయానికి స్వామి వారి బండారు రాసుకుని ఇంటిముఖం పడతారు. నేడు గురువారం సాయంత్రం ఈ సమరం జరుగనుంది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు హాజరు కానున్నారు. ఈ ఉత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ ఎస్ఐ వరప్రసాద్ ఆద్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## రంగనాథస్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం



**మద్దికెర,మార్చి 22,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెరవలి రంగనాథ స్వామి దేవాలయం నందు బుధవారం ఉగాది పండుగ పురస్కరించుకుని స్వామి వారి పల్లకి సేవ,పంచాంగ శ్రవణం జరిగింది. అలాగే మండల కేంద్రమైన మద్దికెరలో బ్రహ్మయ్య గుడి సన్నిధి నందు శ్రీ బండారు సంజీవయ్య స్వామి పంచాంగ శ్రవణం పఠించారు. సాయంత్రం ఆంజనేయస్వామి పటంతో పురవీధుల గుండా భాజాభజంత్రీలు,కళశాలతో ఊరేగింపుగా వెళ్లి తెలుగు పండుగను కన్నుల పండుగలా చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య కమిటీ,విశ్వహిందూ పరిషత్ సభ్యులు,భజరంగదళ్ సభ్యులు,గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ ఆంజనేయస్వామి నూతన రథోత్సవం

**- భారీగా తరలివచ్చిన భక్తులు**


**పెద్దకడుబూరు,మార్చి 22,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పెద్దకడుబూరులో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి నూతన రథోత్సవ వేడుకలు బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా,వేలాది మంది భక్తుల మధ్య జరిగాయి. మండలంలోని గ్రామ పెద్దలు నరవ రమాకాంత్‌రెడ్డి,గార్ల జంపన్న,కేశన్న,ఆచారి,పెద్దలందరు కలిసి శ్రీ ఆంజనేయ స్వామి రథోత్సవం సుమారుగా రూ.13లక్షలు వెచ్చించి ఆంజనేయస్వామి రథోత్సవం చేయించడం జరిగింది. అయితే 2023లో ఉగాది పండుగ సందర్భంగా గ్రామంలో ప్రజలందరు కలిసి ఈ రథోత్సవాన్ని ప్రారంభోత్సవం చేశారు. ముందుగా గ్రామ నడిబొడ్డున ఉన్న చావడి దగ్గర శ్రీ ఆంజనేయస్వామికి ఉదయం అభిషేకం,ఆకులపూజ తదితర పూజలు చేశారు. సాయంత్రం గ్రామపెద్దలు హోమగుండం కాలా్చరు. గ్రామప్రజలు ప్రతి అక్క చెల్లెమ్మలు పట్టువస్త్రాలు ధరించాలని కోరడం జరిగింది. అలాగే చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు రథోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆంజనేయస్వామి రథోత్సవం ప్రతి ఏటా ఇలాగే వైభవంగా జరగాలని,మండలంలో ఉన్న ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని,పంటలు బాగా పండాలని గ్రామపెద్దలు స్వామి వారిని కోరడం జరిగింది. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## చల్లా పార్టీ కార్యాలయం ప్రారంభం

**- నాన్న గారి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా : చల్లా విఘ్నేశ్వరరెడ్డి**

**అవుకు,మార్చి22,ప్రభాతవార్త:** అవుకు పట్టణంలో తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగ రోజు చల్లా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చల్లా పార్టీ కార్యాలయాన్ని పున:ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో చల్లా అభిమానులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని చల్లా కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.నూతన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా చల్లా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ చల్లా కుటుంబం తరుపున రాజకీయ వారసులుగా చల్లా విఘ్నేశ్వరరెడ్డిని ప్రకటించడమైంది.ఈ సందర్భంగా చల్లా విఘ్నేశ్వరరెడ్డి మాట్లాడుతూ కీ.శే.లు స్వర్గీయ చల్లా రామకృష్ణారెడ్డి ఆశయాలకు అనుగుణంగా చల్లా అభిమానులకు,నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ కుల,మతాలకు అతీతంగా గొడవలకు తావులేకుండా అవుకు ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా నాన్నగారి పాలన ప్రజలకు అందిస్తానని తెలియజేశారు.అంతేకాక ప్రజలకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్న నేరుగా చల్లా విఘ్నేశ్వరరెడ్డి దృష్టికి తీసుకునివస్తే పరిష్కరిస్తానని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అవుకు ఎంపిపి చల్లా రాజశేఖర్‌రెడ్డి,చల్లా విజయ్ భాస్కర్‌రెడ్డి,అవుకు మాజీ సర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి,వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి,కాశీపురం రామిరెడ్డి,వైసీపీ కార్యకర్తలు,ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా ఉగాది పండుగ సంభరాలు -రాతి దూలము పోటీలు



**కోవెలకుంట్ల,మార్చి 22,ప్రభాతవార్త :** తెలుగుసంవత్సరాది పండును పల్లెల్లో పట్టణాల్లో ప్రజలకు ఘనంగా జరుపుకున్నారు. కోవెలకుంట్ల సబ్ డివిజన్ వ్యాప్తంగా అని ్న గ్రామాల్లో ప్రజలకు ఉగాది పండును అంగాంగవైభవము జరుపు తున్నారు. ముఖ్యంగా గ్రా దేవతలకు స్త్రీలు, పురుషులు భక్తిశ్రర్దలతో పూలు చేశారు. ముఖ్యంగా మారెమ్మ, సుంకులమ్మ, పోలేరమ్మ, అంకాలమ్మ లాంటి దేవతలకు ఈపండుగలో పూజలు చేయడము అనవాయితి.అందులో బాగంగా ఉదయము నుండే స్త్రీలు గ్రామాల్లో ఉన్న దేవతగుళ్ల వద్ద క్యూ కట్టారు. అలాగే కోవెలకుంట్ల పట్టణంలోని సుంకులమ్మ దేవాలయము వద్ద పండుగను పురస్కరించుకుని ఒంటి ఎద్దులు రాతి దూలము లాగే పోటీలు ఏర్పాటు చేశారు ఈ పోటీలను ప్రతి ఏడాది అనవాయితీగా నిర్వహించడము జరుగుతుంది.అందులో బాగంగనే బుదవారము ఎడ్ల రాతి దూలము పోటీలను మాజీ జెట్‌పిటిసి సభ్యులు బివిప్రసాదరెడ్డి మాజీ మార్కెట్ యాడు చైర్మన్ బివి.నాగార్జునరెడ్డి కానాల రవికుమారెడ్డిలు లాంచనంగా ప్రారంబించారు ఈ పోటల్లో 8 ఎడ్లు పాల్గొన్నడము జరిగింది.ఇందులో నిర్ణీత 10నిమిషాలకు సూర్యత్యేజ వృషభాలు నిలువడముతోవాటికి రూ 6000 బహుమతిని అందించారు. అలాగే ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలచిన ధనుంజయ, పల్లయ్య ఎడ్లకు రూ 5000,రూ 4000బహుమతులను అందించారుజ. నాల్గు, 5వ స్థానాల్లో నిలచిన బోయ పెద్దయ , మోహాను ఎడ్డకు రూ 3000,2000బహుమతులను అందించారు.

## 5కిలోల వెండి,విగ్రహాలు విరాళం

**మద్దికెర,మార్చి 22,ప్రభాతవార్త :** కసాపురం గ్రామంలో ఉగాది పండుగ పురస్కరించుకుని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి నూతన నిర్మాణ రాతి దేవాలయంలో ఉత్సవ వెండి ఐదు కిలోలు, రూ.4లక్షలు విలువ గల విగ్రహాలు తిలక్ నగర్ వాసులైన ఎం పుష్పాంజలి,శంకర్ కుమారులు ఎం జితేంద్ర,ఎం జగదీష్‌లు రూ.4లక్షల బ్యాంక్ చెక్ ద్వారా ఆలయ వ్యవస్థాపకులు తలారి పరశురాముడు,శకుంతల దంపతులకు బుధవారం అందచేయడం జరిగింది. సత్య మల్లికార్జున స్వామి,రామ్ చరణ్ తేజ,మునీశ్వరప్ప,భీమన్న,సౌమ్య,వాణి,సరోజ,శివ,రత్న తదితరులున్నారు

## అర్చకులు,వేదపండితుడిని సత్కరించిన ఆలయ ఈవో



**బనగానపల్లెరూరల్,మార్చి22,ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయం నందు బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉగాది పర్వదినం ఉగాది ఆస్థాన ఉత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు,వేదపండితుల మంత్రోచ్చారణలతో పంచాంగ పఠనం వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ,ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శోభకృత్ నామసంవత్సర ఉగాది పురస్కారాల సందర్భంగా ఇద్దరు అర్చకులు మరియు ఒక వేదపండితుడికి రూ.10,116లు సంభావనతోపాటు శాలువ,పంచె,కండువా అందజేసి వారిని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.ఎల్.ఎన్. రామానుజన్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పి.ఆర్.వెంకటేశ్వరరెడ్డి,నందివర్గం ఎస్ రామాంజనేయరెడ్డి,ఆలయ అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## జగద్గురు ఖాదర్‌లింగస్వామి దర్గాలో నూతన పంచాంగ పఠనం



**కౌతాళం, మార్చి22, ప్రభాతవార్త ;** కౌతాళం మండలంలోని శ్రీశ్రీ జగద్గురు ఖాదర్‌లింగస్వామి దర్గాలో బుధవారం ఉదయం 9 గంటలకు ఉగాది పంచాంగ పఠనం కార్యక్రమాన్ని చేపట్టారు. దర్గా పీఠాధిపతి సయ్యద్‌మున్నాబాషా మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా 345 సంవత్సరాల చరిత్ర కాలం నాటి నుంచి రంగయ్యతాత వంశస్థులు పంచాంగం చెప్పడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆయన కుటుంబం నుంచి బద్రీనాథ్‌స్వామి ప్రతి యేడాది పంచాంగం చెప్పడం జరుగుతుందన్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా దర్గాలో పంచాంగం చెప్పడం జరిగిందన్నారు. చాలామంది హిందూ సోదరులు ముస్లీం సోదరులు పంచాంగం చెప్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నమున్నా, భక్తులు పాల్గొన్నారు.

## నందవరం శ్రీ చౌడేశ్వరిదేవికి బోనాలు సమర్పించిన మహిళలు



**బనగానపల్లె,మార్చి22,ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా గ్రామ మహిళలు పెద్దఎత్తున బోనాలు సమర్పించారు.అలాగే శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవాలలో భాగంగా ఉదయం గణపతి



పూజా,పుణ్యహవాచన,అంకురార్పణ,పంచాంగ శ్రవణము నిర్వహించారు.అదే విధంగా సాయంకాలం 5 గంటల న ఉండి 6గంటల వరకు గ్రామ రైతు సోదరులచే పన్నేరపు ఎద్దుల బండ్లు ఆలయం చుట్టు తిప్పే కార్యక్రమం నిర్వహించారు.సాయంత్రం 6.30గంటలకు ప్రాకార రథోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పి.ఆర్.వెంకటేశ్వరరెడ్డి,ఆలయ కార్యనిర్వహణాధికారి వి.ఎల్.ఎన్.రామానుజన్,గ్రామ పెద్దలు పి.ఎల్.తులసిరెడ్డి,పి.వి.కుమార్‌రెడ్డి,పి.దశరథరామిరెడ్డి,నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి,గణేష్ యాదవ్,ఆలయ సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చనుగొండ్లలో వాల్మీకి నూతన కార్యవర్గం ఎన్నిక

**గూడూరు,మార్చి 22, ప్రభాతవార్త :** గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో బుధవారం వాల్మీకుల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గూడూరు వాల్మీకుల సంఘం నాయకులు ఎల్.వెంకటేశ్వర్లు , చనుగొండ్ల వాల్మీకుల సంఘం నాయకులు ఉరుకుంద ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చనుగొండ్ల గ్రామ వాల్మీకీ అధ్యక్షునిగా బోయ జులుగారి సోమేష్,ఉపాధ్యక్షులుగా వై.మద్దిలేటి,ప్రధానకార్యదర్శిగా రామన్న,సహాయకార్యదర్శిగా నాగేశ్వరనాయుడు,ఆర్గనైజర్‌గా రామచంద్రుడు,కోశాధికారిగా గుంటప్ప,గౌరవ సలహదారులుగా తలారి లింగన్నలను ఎన్నుకున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి పెద్దలు జి.శ్రీనివాసులు (శేషు),డ్రైవర్ రామక్రిష్ణ,నాగరాజు,నరసింహ,రంగయ్య,పెద్దమాదన్న,భగవంతు,డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల్లో ఉన్న వాల్మీకులు తిరుగుబాటు చేయండి

**- టిడిపి లీగల్ సెల్ నాయకులు,తెలుగు రాష్ట్రాల బిసి,వాల్మీకి సంఘం నాయకుడు వీరన్ననాయుడు**

**ఆదోని,మార్చి 22,ప్రభాతవార్త :** రాజకీయ పార్టీల్లో ఉన్న వాల్మీకులు తిరుగుబాటు చేయాలని తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ నాయకుడు,తెలుగు రాష్ట్రాల బిసి,వాల్మీకి సంఘం నాయకుడు వీరన్ననాయుడు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలో ఉన్న వివిధ పార్టీలకు సంబంధించిన వాల్మీకి నాయకులు ఎవ్వరి జెండాలు మోయొద్దన్నారు. స్వాతంత్ర్య భారతదేశం నుండి ఇప్పటివరకు వెనుకబడిన కులాలు పిలుపునిస్తే ఏ ఉద్యమాలు కూడ విజయవంతం కాలేదు. అలాగే కొన్ని పెద్ద కులాలు పిలుపునిస్తే గాంధీ నాయకత్వాన్ని మద్దతిచ్చారన్నారు. వివిధ రాష్ట్రాల్లో కూడ పెద్దకులాలు పిలుపునిస్తేనే ఉద్యమాలు విజయవంతమయ్యాయన్నారు. దేశచరిత్రలో కింది కులాలకు సంబంధించిన వారు పార్టీలకు అతీతంగా పిలుపునిచ్చి ఉద్యమాలు విజయవంతం చేసి చూపారా వారి గుండెల మీద చేయి వేసుకుని చెప్పాలని ప్రశ్నించారు. కావున దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు వారికి జెండాలు మోయకుండ తిరుగుబాటు చేయాలన్నారు. 1982-83లో తెలుగు రాష్ట్రాల్లో రామారావు పిలుపునిస్తే తిరుగుబాటు జరిగిందని కానీ ఆ తిరుగుబాటుతో రాష్ట్రంలో ఎస్‌సి,ఎస్‌టి,బిసి,ముస్లిం,మైనార్టీ వర్గాలు తెదేపాను ఆదరించారన్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ 2024లో వాల్మీకులను ప్రధానంగా గుర్తించి ఎమ్మెల్యే,ఎంపి సీట్లు కేటాయిస్తే వాల్మీకులు,ఎస్‌సి,ఎస్‌టి ,మైనార్టీలు టిడిపిని ఆదరిస్తారన్నారు. ఆలూరు నియోజకవర్గం నుండి తనకు టిడిపి ఎమ్మెల్యే టికెట్టు ఇస్తే ఆలూరు నియోజకవర్గంలోని ప్రాజెక్టులు,రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇందుకు టిడిపి అధినేత చంద్రబాబునాయుడు కూడా సానుకూలంగా స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేడు హైస్కూల్స్‌కు లోకల్ హాలిడే లేదు

**నంద్యాల విద్య, మార్చి 22, ప్రభాతవార్తః**

పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న దృష్ట్యా నంద్యాల జిల్లా డివిజన్ పరిధిలోని హైస్కూల్స్‌లో నేడు 23వ తేది లోకల్ హాలిడేగా ఏవరికి అనుమతి ఇవ్వడం లేదని నంద్యాల డిప్యూటి డిఇఓ మహబూబ్‌బేగ్ తెలిపారు. పదవతరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేది ప్రారంభమవుతున్న దృష్ట్యా విద్యార్థులకు ప్రతే ్యక తరగతుల నిర్వహణ చేపట్టెందుకు విద్యార్థులను చదివించేందుకు లోకల్ హాల్‌డే ఏ పాఠశాలకు ఇవ్వడం లేదని పరీక్షణ నిర్వహణ కోసం విద్యార్థులు కష్టపడి చదివించి ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఓ ప్రణాళిక బద్దంగా ప్రగతిసాధించాలని ఆయన సూచించారు.

## శోభకృత్‌నామ సంవత్సరం

**- ఉద్యమ నామ సంవత ్సరమే**




**కర్నూలు విద్య , మార్చి 22, ప్రభాతవార్తః**

రాష్ట్రంలో ఉన్నటువంటి 11 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన ్షనర్ల సమస్యల పరిష్కారానికై రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం శోభకృత్ నామసంవత ్సరాన్ని ఉద్యమ నామ సంవత ్సరంగా పరిగణిస్తుందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్ గోకారి తెలిపారు. స్థానిక సలాంఖాన్ ఎస్టీయుభవన్‌లో హిరాలాల్, శాంతిమూర్తి పండితుల అధ్యక్షతన ఉగాది పర్వదినంన పంచాంగ శ్రవణ పఠనం జరిగింది. రాశుల వారిగా ఆదాయ వ్యయాలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశోభకృత్ నామ సంవత ్సరంలో రాష్ట్రంలో ఉన్నటువంటి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు, ప్రజలు సుఖసంతోషాలతో జీవనం గడపాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత ్సరాలు పూర్తికావస్తున్నా వారంలో రద్దుచేస్తామన్న సీపీఎస్ చేయలేదన్నారు. పిఆర్సీ బకాయిలు, డిఏ బకాయిలు, జడ్పీ పిఎఫ్, ఏపీ జిఎల్ఐ రుణాలు తుది చెల్లింపులు సిపిఎస్ రద్దు, కెజిబివి ఉపాధ్యాయులకు ఎంటిఎస్ అమలు ఏకీకృత సర్వీసు రూల్స్, ఉపాధ్యాయుల బదిలీలు, రెగ్యులర్ పదొన్నతుల కొరకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నిరంతరం ఉద్యమాలకు శ్రీకారం చేపడుతుందన్నారు. సమావేశంలో జిల్లాకార్యదర్శి టికె జనార్ధన్, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ ముదసీర్ సీనియర్ నాయకులు నాగరాజు, శేఖర్, ముర్తుజావలి, గోవింద్‌నాయక్, నాగయల్లయ్య, పవిత్రన్, భాస్కర్, రామచంద్రుడు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబుల్ స్టార్ రాంచరణ్ జన్మదిన సందర్భంగా

**- పరివర్తన సెంటర్ చిన్నారులకు అన్నదానం**



**నంద్యాల హాస్పటల్, మార్చి 22, ప్రభాతవార్తః** ప్రముఖ సినీనటుడు రాజకీయ నాయకుడు మెగా స్టా ్ర్ చిరంజీవి తనయుడు రాంచరణ్ పుట్టరోజు సందర్భంగా బుధవారం పరివర్తన సెంటర్‌లో చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు పబ్బతి రవికుమార్, సందీప్, సురేష్‌చౌదరి, సాయి జయంతి, సుమన్ చెర్రి, సోలోసాయి, శివ, అయూబ్‌బాష, జూలెపల్లె లింగమయ్యతో పాటు పలువురు అభిమానులు పాల్గొన్నారు. గ్లోబల్‌స్టార్ కొణిదేల రాంచరణ్ జన్మదిన వారోత్సవాలను ప్రతిసంవత ్సరం వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఇందులో రెండవ రోజులో భాగంగా ఎస్ఆర్‌బిసి కాలనీలో వున్న పేద చిన్నారులకు అన ్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిసంవత్సరం నిర్వహించే ఈకార్యక్రమాల్లో రాష్ట్ర రాంచరణ్ యువశక్తి అధ్వర ్యంలో ప్రతే ్యక కార్యక్రమాలు అన్నదాన శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని అధ్యక్షులు పబ్బతి రవికుమార్ తెలిపారు.

## వైభవంగా శ్రీ రామమ్మ అవ్వ రథోత్సవం



**హొళగుంద,మార్చి 22,ప్రభాతవార్త :** మండల పరిధిలోని బొమ్మగుండనహళ్లి గ్రామంలో వెలసిన శ్రీ రామమ్మ అవ్వ రథోత్సవ కార్యక్రమం అశేష భక్తజనుల మధ్య బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయంలో కొలువైన శ్రీ రామమ్మ అవ్వకు గ్రామస్తులు ఉదయం నుండే ప్రత్యేక పూజలు నిర్వహించి పిండివంటలతో నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అశేష భక్త జనుల మధ్య శ్రీ రామమ్మ అవ్వ రథోత్సవం ఎదురు బసవన్నగుడి వరకు రథాన్ని లాగారు. రథోత్సవ కార్యక్రమానికి మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని ప్రత్యేకపూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా గ్రామంలో బైలాట నాటకం భక్తులను ఆకట్టుకుంది. రథోత్సవం సందర్భంగా గ్రామంలో ప్రతి ఇల్లు బంధువులు,ఆడపిల్లలతో కిటకిటలాడాయి. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ ఎస్ఐ అబ్దుల్ జహీర్ ఆద్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



**బేతంచెర్ల,మార్చి22,ప్రభాతవార్త:** తెలుగు సంవత్సరాది శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా బుధవారం విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు స్థానిక శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం నందు తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరు వార,తిధి,నక్షత్రాలతో కూడిన తెలుగు క్యాలెండర్‌ను ఇంట్లో ఉంచుకోవడం వల్ల శుభ ముహుర్తాలు నిర్ణయించుకునేందుకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని వారన్నారు.జనవరి 1వ తేది నూతన సంవత్సరం కాదని తెలుగువారికి చైత్రమాసం పాఢ్యమి శుక్లపక్షం నాడు మొదలయ్యే ఉగాది నుండే నూతన సంవత ్సరమని వారన్నారు.అలాగే ఆలయ ప్రాంగణంలో పంచాగశ్రవణము జరిగింది.గ్రామ దేవత సుంకులా పరమేశ్వరి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.ఆయా కార్యక్రమాలలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు గౌరు ఉసేన్‌రెడ్డి,చం ద్రమౌళీశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి,మారుతి కృష్ణశర్మ, వెంకటేశ్వర్లు, గౌడ్,నాగమోహన్,శ్రీను,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం

**గడివేముల, మార్చి22, ప్రభాతవార్త ;** మండలంలోని గడిగరేవుల గ్రామంలో ఉగాది పండగను పురస్కరించుకుని బుధవారంనాడు పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దుర్గా సమేత భోగేశ్వరస్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని పురవీధులగుండా స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా నిర్వహించి గ్రామోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా భోగేశ్వర ఆలయ అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ ఆధ్వర్యంలో జరిగింది. పంచాంగ శ్రవణం కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**వెల్దుర్తి, మార్చి22, ప్రభాతవార్త :** ఉగాది పండుగ పురస్కరించుకొని వడ్డగేరి సుంకుల మ్మ అమ్మవారికి వడ్డెరకులస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్స వ విగ్రహాన్ని బుధవారం పల్లకి లో పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. అదేవిధంగా వెల్దుర్తి పట్టణానికి చెందిన విరు పాక్షయ్య జ్ఞాపకార్థం ఆయన కుమార్తె రాధమ్మ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి వెండి ప్రమీదలు విరాళంగా అందించారు.

**---నేడు అమ్మవారికి బోణాలు:** వడ్డగేరి సుంకులమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అమ్మవారికి వేకువజామున జలాభిషేకం చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ముందుగా ఎస్సీ కాలనీలోని మారెమ్మ అమ్మవారికి బోణాలు తీసుకెళ్లి సమర్పించిన అనంతరం వడ్డగేరిలో ఉన్న సుంకులమ్మ అమ్మవారికి మహిళలు ప్రతి ఇంటి నుంచి పెద్దఎత్తున బోణాలు సమర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

**--వెల్దుర్తి మండలంలో ఘనంగా ఉగాది వేడుకలు..** వెల్దుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రధాన ఆలయాల్లో పండితుల మంత్రోచ్చరణల మధ్య వేకువ జామున నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరై వారి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పండుగ(తెలుగు సంవత్సరాది) వేడుకలు గ్రామ గ్రామాన జరిగాయి. ఉగాది పచ్చడి చేసుకొని ఇరుగు పొరుగు వారికి పంచి పెట్టారు. పిండివంటలు సైతం చేసుకొని ఆరగించారు.

## రామళ్లకోటలో క్రికెట్ పోటీలు ప్రారంభం



**వెల్దుర్తి, మార్చి22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రామళ్లకోట గ్రామంలో వెలసిన వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి తిరుణాల సందర్భంగా గ్రామ ప్రజలు పెద్దల సహకారంతో నిర్వహిస్తున్న టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ (పోటీలు) బుధవారం గ్రామపెద్దలు, వైకాపా నాయకులు పి.జి.మాధవస్వామి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. మొదటిబహుమతి రూ.30వేలు(దాతలు పి.జి.రాంగోపాల్‌నాయుడు, మాధవ స్వామి, రాజగోపాల్, యుగంధర్‌లు), రెండో బహుమతి రూ.20వేలు(దాతలు సనిమిరి మద్దయ్య, బి.రమణ-బొగ్గుల మద్దిలేటిలు) ఉన్నారని నిర్వాహకులు మనోజ్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 48 క్రికెట్ జట్లు నమోదు చేసుకున్నారన్నారు. ఈ పోటీలు ఏప్రిల్ 7వ తేది నాటికి పూర్తిచేసేందుకు నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బిటి.నాయుడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు పూరిగుడెసెలు దగ్ధం



### బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

**మహానంది, మార్చి 22, ప్రభాతవార్త:** మహానంది మండలం అల్లినగరం గ్రామంలో మంగళవారం రాత్రి విద్యుత్‌షాట్ సర్క్యూట్‌కు గురై రెండు పూరిగుడెసెలు దగ్ధం అయినట్లు బాధితులు పేర్కొన్నారు. చుక్కా మధు, పొంత విజేయుడులకు చెందిన గుడిసెలు దగ్ధం అయినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అల్లినగరం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి, మౌలీశ్వర్‌రెడ్డి టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఉగాది పండుగ కవిసమ్మేళనం షడ్రుచులుగా మారింది - కవిసమ్మేళనంతో ఉగాది పండుగ



**నంద్యాల విద్య, మార్చి 22, ప్రభాతవార్త:** శోభకృత్‌నామ తెలుగు సంవత్సర అరంభ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక అధ్వర్యంలో వివేకానంద అడిటోరియంలో ఉగాది కవి సమ్మేళం బుధవారం ఘనంగా జరిగింది. పట్టణంలోని వివేకానంద అడిటోరియంలో రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డా.జి.రామకృష్ణారెడ్డి అధ్వర్యంలో డా.గెలివి సహదేవుడు, సాయితీ స్రవంతి అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపాల్ సుబ్బయ్యల అధ్వర్యంలో కవి సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఉగాది కవి సమ్మేళనంలో కవులు నీలకంఠమాచారి, నరేంద్ర, కొప్పుల ప్రసాద్, రత్నకుమారి, లలితా సరస్వతీ, అన్నెం శ్రీనివాసరెడ్డి, ఇంతియాజ్ అహమ్మద్, ఎల్లయ్య, రఫీ, మోహన్‌రావు, బాలరాజులు వినిపించిన కవిత్వం అందరిని ఆకట్టుకుంది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజల మనోతేజస్సు ఉగాది పండుగ అని తెలుగు సంస్కృతి సాంప్రదాయాలకు, ప్రకృతి సోయగాలకు స్వాగతం పలికే ఈ ఉగాదితో ప్రజలందరు సుఖసంతోషాలతో మానవత్వపు విలువలతో నడుచుకోవాలని సూచించారు. ఉగాది కవిసమ్మేళనం షడ్రచుల సమ్మేళనంగా మారిందని, సకల శుభాలను కలిగించే ఉగాది పండుగ అందరికి మేలు చేకూర్చాలని పేర్కొన్నారు. సమావేశంలో శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు చిలకల బాలరాజు, ప్రధాన కార్యదర్శి నీలం వెంకటేశ్వర్లు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల దేవాలయంలో పంచాంగ శ్రవణం



**దేవనకొండ, మార్చి 22, ప్రభాతవార్త :** తెలుగు వారి కొత్త సంవత్సరం శ్రీ శుభకృత్ నామ ఉగాది పండుగ సందర్భంగా మండల పరిధిలోని పి కోటకొండ గ్రామంలోని శ్రీ సీతారాముల వారి దేవాలయంలో బుధవారం ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమం జరిగింది. పండితులు జనపాటి ప్రసాద్ శర్మ పంచాంగ శ్రవణం గురించి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కౌలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్ ఆర్ హనుమంతరెడ్డి, ఎంపిటిసిలు హనుమంతరెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మణస్వామి, రంగడు, వెంకటేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

## రథోత్సవానికి గజమాల సమర్పణ



**ఆస్పరి, మార్చి 22, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఆస్పరిలో ఉగాది పండుగ పురస్కరించుకుని బుధవారం జరిగిన జనార్ధన స్వామి రథోత్సవానికి జనార్ధన స్వామి హమాలీ సంఘం యూనియన్ ఆద్వర్యంలో స్వామి వారికి గజమాల సమర్పించి భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఉగాది పండుగ పురస్కరించుకుని హమాలీ సంఘం ఆద్వర్యంలో ఎంతో భక్తిశ్రద్దలతో స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుండి గజమాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి వారి రథోత్సవానికి సమర్పించారు. ప్రతి ఏటా ఈ పండుగను ఎంతో అత్యంత వైభవంగా మూడురోజుల పాటు జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం గౌరవ అధ్యక్షులు మహానంది, అధ్యక్షులు సిపి మహానంది, కార్యదర్శి ఆంజనేయులు, హమాలీ సంఘం నాయకులు వీరేష్, రాము, వెంకటేష్, జి వీరేష్, శేఖర్, హనుమంతు, చిన్న, రాముడు, రంగన్న, ప్రకాష్, రమేష్, నాగరాజు, బసవరాజు, చిన్న తిక్కయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## కన్నడ భక్తులతో పోటెత్తిన మహానంది క్షేత్రం -ఉగాది పంచాంగశ్రవణం అవిష్కరణ



**మహానంది, మార్చి 22, ప్రభాతవార్త:** ప్రముఖ శైవక్షేత్రమైన మహానంది క్షేత్రం కన్నడ భక్తులతో పోటెత్తింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మహానంది క్షేత్రంలో శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు ఆలయ వేదపండితులు రవిశంకర్ అధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఇఒ దంపతులు పాల్గొన్నారు. స్వామి అమ్మవార్లకు పీఠార్చన సహిత రుద్రాభిషేకం, ఖడ్గమాలర్చనలు వైభవంగా నిర్వహించినట్లు ఆలయ వేద పండితులు రవిశంకర్ అవధాని తెలిపారు. ముందుగా గణపతిపూజ, పుణ్యహావచనం, ఉత్సవవరులకు, తిరుమంజనం చేసి నింబకుష్మా, భక్షణ నివేదన సమర్పించినట్లు తెలిపారు. కన్నడభక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. పంచాంగశ్రవణం పుస్తకావిష్కరణ: మహానంది క్షేత్రంలో ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, ఆలయ చైర్మన్ కొమ్మా మహేశ్వర్‌రెడ్డి, ఇఒ చంద్రశేఖర్‌రెడ్డి పంచాంగశ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పుస్తకావిష్కరణ చేసి పంచాంగశ్రవణ పుస్తకాలు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గంగిశెట్టి మల్లిఖార్జున, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హైసెక్యూరిటి జోన్లుగా 10 పరీక్షా కేంద్రాలు

- పేపర్ లీకేజ్ మాల్‌ప్రాక్టిస్‌కు తావులేకుండా పకడ్బంది ఏర్పాట్లు
- ప్రశ్నపత్రంపై 7 అంకెల ప్రత్యేక కోడ్



**నంద్యాల విద్య, మార్చి 22, ప్రభాతవార్త:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3వ తేది నుంచి 18వ తేది వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. గత ఏడాది పబ్లిక్ పరీక్షల సమయంలో నంద్యాల జిల్లాలో మాస్‌కాపీయింగ్, మాల్‌ప్రాక్టిస్ జరిగిందన్న ఆరోపణలో 24 మంది ఉపాధ్యాయులు సస్పెండ్ చేయడం జరిగింది. వీరిపై క్రిమినల్ కేసులు కూడ నమోదుచేసిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. సుమారు 10 నెలల పాటు సస్పెన్షన్‌లో ఉంచి చివరికి నాల్గవ క్యాటగిరి స్కూల్స్‌లో వారికి పోస్టింగ్ ఇవ్వడం జరిగింది. నంద్యాల జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ ఈసారి జరిగే పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జిల్లా విద్యాశాఖ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం అనురాధ అధ్వర్యంలో పబ్లిక్ పరీక్షలు సాఫీగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 22,661 మంది గత ఏడాది ఫెయిల్ అయిన విద్యార్థులు 2,750 మంది తిరిగి పరీక్షలు రాసేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలో 125 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు ఉదయం 8.45 లోపల పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. హైసెక్యూరిటీ జోన్లుగా పరీక్ష కేంద్రాలను నిర్వహించారు. పేపర్ లీకేజ్, మాల్‌ప్రాక్టిస్, మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పకడ్బంది ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రంపై 7 అంకెల ప్రత్యేక కోడ్ ఉంటుంది. పరీక్ష కేంద్రంలో సీరియల్ నంబరుగా విద్యార్థులకు పంపిణి చేస్తారు. ఒఎంఆర్ షీట్, అన్సర్ బుక్‌లెట్‌లో ఏ ఒక్కపేజిని చింపినా మాల్‌ప్రాక్టిస్‌గా పరిగణిస్తారు. ఏవరు కూడ సెల్‌ఫోన్లను తీసుకురాకూడదు. ఏడాది పొడువునా ఎంతో శ్రమించి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలనే లక్ష్యంతో హాజరయ్యే కొంతమంది విద్యార్థులకు ఎక్కడో ఒకచోట ప్రశ్నపత్రం లీక్ అయిందంటూ వచ్చే వదంతులతో విద్యార్థులు ఎంతో అందోళనకు గురవుతున్నారు. పరీక్షా కేంద్రాల అన్ని వసతులను ఏర్పాటు చేశారు. పాస్‌పరన్స్‌టేజి కోసం మాల్‌ప్రాక్టిస్‌కు పాల్పడరాదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ షాపులు మూసివేయాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంటు అధికారులు, ఎంఇఒలు, ఇన్విజిలేటర్లు చిత్తశుద్దితో పరీక్షలను అప్రమత్తంగా నిర్వహించాలన్నారు.

## రామాలయంలో పంచాంగశ్రవణ ఉగాది వేడుకలు



**నంద్యాల టెక్కె, మార్చి 22, ప్రభాతవార్త:** శ్రీశోభకృత్ నామ సంవత్సరంలో పట్టణంలోని రామాల యంలో శ్రీభగవత్‌సేవా సమాజ్ అధ్వర్యంలో పంచాంగశ్రవణ కార్యక్రమం వెంకటేశ్వరస్వామి ఊంజలసేవను నిర్వహించారు. అధ్యక్షులు సముద్రాల సూరయ్య ప్రధాన కార్యదర్శి వంకదార మధుసూదన్‌రావు, కోశాధికారి మాఘం గురుప్రసాద్, దేవరశెట్టి శ్రీనివాస్ తదితరులు ఈకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వస్థిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉత్తరాయణం చైత్రశుద్ద దశమి వరకు వసంత నవరాత్రుల కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఉగది పర్వదినం పండుగ సందర్భంగా కార్తీకేయ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్య క్రమాన్ని ఏర్పాటు చేశారు. ద్వాదశి రాశుల వారికి ఆదాయ వ్యయ రాజ్యపూజ అవమానాలను తెలియపరిచారు. పండుగ రోజున ఆలయ ప్రాంగణంలో వెలసిన అందరి దేవుళ్ళకు హరిహర దేవతలకు వస్త్రాలు దేవరశెట్టి శ్రీనివాస్ కుటుంబం నవరాత్రుల ప్రథమపూజ కార్యక్రమంతో పాటు వస్త్రాలను సమర్పించారు. వసంత నవరాత్రుల్లో ప్రతిరోజు సాయంకాలం దేవతలకు ఊంజలసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## రథం పెట్టేందుకు ఉచితంగా స్థలం ఇచ్చిన దాతలకు అభినందనలు



**పగిడ్యాల, మార్చి 22, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పగిడ్యాలలో శ్రీరామనవమి సందర్భంగా రథోత్సవం అనంతరం రథాన్ని పెట్టేందుకు గాను స్థలం ఉచితంగా దానం చేసిన దాతలను గ్రామస్తులు అభినందించారు. బుధవారం స్థలం దానం చేసిన దాతలు కీ.శే.రాయపు శివారెడ్డి, ధర్మపత్ని శేషమ్మ, వారి జ్ఞాపకార్థం కీ.శే.మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, ధర్మపత్ని శివమ్మ, వారి కుమారులు కీ.శే.రాయపు రామేశ్వరరెడ్డి, ధర్మపత్ని జయమ్మ, వెంకటరామిరెడ్డి ధర్మపత్ని చాయలీల, రామసుబ్బారెడ్డి ధర్మపత్ని ప్రభావతమ్మ కీ.శే.కొండారెడ్డి ధర్మపత్ని మల్లమ్మ, వీరి కుమారులు రాయపు రామచంద్రారెడ్డి ధర్మపత్ని నిర్మలాదేవి, వెంకటరమణారెడ్డి ధర్మపత్ని అరుణమ్మ, శివానందభారతి (జయప్రకాష్ రెడ్డి) లు శిలాపలకంను సర్పంచ్ శేషన్న, గ్రామపెద్దల చేత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగిరెడ్డిగారి రమాదేవి, గ్రామపెద్దలు నాగేశ్వరెడ్డి, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సీతారామిరెడ్డి, వెంకటరమణారెడ్డి, బొగ్గుల శివారెడ్డి, రాయపు కుటుంబసభ్యులు రాజకీయపార్టీలకు అతీతంగా పాల్గొన్నారు. స్థలదాతలను గ్రామస్తులు అభినందించారు.

## రైతుల సమస్యలు పరిష్కారించక పోతే కేంద్రం మెడలు వంచుతాం



**కొత్తపల్లి, మార్చి 22, ప్రభాతవార్త:** రైతుల సమస్యలు పరిష్కారించక పోతే కేంద్రం మెడలు వంచుతామని, ప్రజా సంపాదనంతా పెట్టుబడుల కార్పోరేట్ చేతుల్లో ఉండడంతో పాటు దేశ ప్రజలపై మరింత పన్నుల భారం మోపుతున్న భాజాపా ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, జిల్లా నాయకులు రామేశ్వరరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాతమాడుగుల, ఎర్రమఠం, ముసలమడుగు, సింగరాజుపల్లి గ్రామాల్లో ఉన్న రైతులను కలిసి ఏప్రిల్ 5న చేపట్టే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతులను కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులను, రైతుల హక్కుల చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని, నంద్యాల జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలి వంటి సమస్యలపై చేపట్టిన ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రుడు, సంజీవరాయుడు పాల్గొన్నారు.

## వైభవంగా జనార్ధనస్వామి రథోత్సవం



**ఆస్పరి, మార్చి 22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఆస్పరిలో వెలసిన శ్రీ జనార్ధనస్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి ఆలయంలో స్వామి వారికి పూలాభిషేకం, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మహామంగళారతి తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామపురవీధుల్లో స్వామి వారి పల్లకిని ఊరేగించారు. అనంతరం వీరశేకర్‌రెడ్డి ఇంటి నుండి కుంభోత్సవాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి రథోత్సవానికి పూజలు నిర్వహించారు. తదనంతరం రథాన్ని భక్తుల మద్య లాగారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు ఆస్పరి, చొక్కనహళ్లి, శంకరబండ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మూలింటి రాధమ్మ, వైసిపి జిల్లా సంయుక్త కార్యదర్శి గోవర్ధన్, కర్నూలు కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది, వైస్ ఎంపిపి తనయుడు ప్రకాష్, ఎంపిటిసి భర్త తిమ్మప్ప, కేశవరెడ్డి, గ్రామపెద్దలు ప్రకాష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరు గారు మాకు మూడు నెలలుగా బియ్యం ఇవ్వడంలేదు



**నందికొట్కూరు, మార్చి 22, ప్రభాతవార్త:** కలెక్టర్ గారు మాకు మూడు నెలలుగా రేషన్ బియ్యం ఇవ్వడంలేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బిజినవేముల గ్రామస్తులు వాపోయారు. మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలోని మూడు వార్డులలో గత మూడు నెలలుగా రేషన్ బియ్యం రావడంలేదని దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోవడంలేదని, డీలరు నాకు తెలియదు ఎండియులను అడగండి అంటు చెబుతున్నారని, మేము కూలినాలి చేసుకొని జీవిస్తున్నామని ప్రభుత్వం ఇచ్చే బియ్యం సక్రమంగా ఇవ్వకుండ ఎవరికైన ఫిర్యాదు చేసుకోండి అన్నరీతిలో ఇక్కడి డీలర్లు, అధికారులు అంటున్నారని రేషన్‌కార్డు దారులు వాపోయారు. పర్యవేక్షించాల్సిన వి.ఆర్.ఓ.ఎప్పుడు వస్తారో తెలియదని కావున ఇప్పటికైన సంభంధిత అధికారులు స్పందించి మాకు రేషన్ బియ్యం అందేలా చూడాలని లేని పక్షంలో నంద్యాల జిల్లా కార్యాలయం వద్దకు వెళుతామని ముగ్గు సుధాకర్, చికెన్ శ్రీను, చిన్న వెంకటరమణ, మధు తెలిపారు.

## కన్నులపండుగలా దుర్గాదేవి రథోత్సవం



**ఆలూరు రూరల్, మార్చి 22, ప్రభాతవార్త :** ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో దుర్గాదేవి రథోత్సవం బుధవారం కన్నుల పండుగలా జరిగింది. ఉదయం కుంభోత్సవంతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అశేష భక్తజనం మద్యం దుర్గాదేవి రథోత్సవం లాగారు. రథోత్సవాన్ని దుర్గాదేవి ఆలయం నుండి ఎల్ఎల్‌సి కెనాల్ అక్కడి నుండి ఆలయం వరకు లాగారు. గ్రామస్తులు రథోత్సవానికి మేళతాళాలతో ఊరేగింపుగా తరలివచ్చి పూలమాలలు వేశారు. రథోత్సవం సందర్భంగా ఆడపడుచులు, బంధుమిత్రులు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ ఎస్ఐ అబ్దుల్ జహీర్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ రథోత్సవంలో గ్రామ పెద్దలు రాజశేఖర్ తాత, మలిగేరి తిమ్మన్న, సర్పంచ్ భర్త శేషన్న, సురేష్, శేషప్ప, బసప్ప, మల్లికార్జున, నరసప్ప, దేవాలయ పూజారి బ్రహ్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుడికి వెళ్లిన దళిత యువకుడిపై దాడి



**నంద్యాల, మార్చి 22, ప్రభాతవార్త:** ఉగాది పండుగ రోజు నంద్యాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రమైన నంద్యాలలో ఉగాది పండుగ పర్వదినాన్ని పురష్కరించుకొని రూరల్ గ్రామమైన మునగాలలో సుంకులమ్మ ఆలయానికి దేవున్ని దర్శనం చేసుకుందామని గుడికి వెళ్లిన దళిత యువకుడైన మల్లెపోగుల నరసింహులు (నరహరి) కొంతమంది దేవాలయంలోకి వెళ్లకుండ అడ్డుకొని దాడిచేశారు. దాడిలో తీవ్రగాయాలు అయ్యాయి. దేవున్ని దర్శనం చేసుకోలేకపోయానని దాడికి గురైన దళితుడు మనస్తాపంతో పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి ఆ యువకుడు పాల్పడ్డారు. హుటాహుటిన నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరిలించారు. పరిస్థితి విషమంగా ఉందని ఐసియు విభాగలో చికిత్స అందిస్తున్నారు. ఆత్మహత్యయత్నానికి పాల్పడిన యువకుడిని ఎమ్మార్పీఎస్ నాయకులు కళ్యాణ్‌మాదిగ పరమార్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాలూక పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 3.శ్రీ మఠానికి రూ.లక్ష విరాళం

**మంత్రాలయం, మార్చి 22, ప్రభాతవార్త:** ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి తమిళనాడు రాష్ట్రం, కోయంబత్తూరు పట్టణానికి చెందిన అర్ముగం అనే భక్తుడు రూ.లక్ష విరాళం అందించినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె శ్రీనివాసరావు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ నగదునుశ్రీమఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదానానికి వినియోగిస్తామని చెప్పారు. విరాళం అందించిన భక్తుడిని శ్రీమఠం పీఠాధిపతి శ్రీసుబుదేంద్రతీర్థులు ఫల, పుష్ప, మంత్రాక్షితలతో ఆశీర్వదించారు.

## ప్రజలందరు సుభిక్షంగా ఉండాలి

:- ఆలూరు తెదేపా మాజీ ఇంచార్జ్ వీరభద్రగౌడ్



**హొళగుంద, మార్చి 22, ప్రభాతవార్త :** గ్రామంలోని ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని గ్రామ ఇలవేల్పు అయిన రామమ్మ అవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలూరు తెదేపా మాజీ ఇంచార్జ్ వీరభద్రగౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బొమ్మగుండనహళ్లి గ్రామంలో జరిగిన రామమ్మ అవ్వ రథోత్సవానికి ఆలూరు తెదేపా మాజీ వీరభద్రగౌడ్ తనయుడు గిరి మల్లేష్‌గౌడ్‌తో కలిసి రథోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన తెదేపా నాయకులతో కలిసి మాట్లాడుతూ ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు గోవిందుగౌడ్, మాజీ మండల కన్వినర్ ఈరన్నగౌడ్, దిడ్డి నాగప్ప, జంపాపురం బసవరాజు, జంబన్న, బిజి హళ్లి నాయకులు పాలాక్షప్ప, దిడ్డి సిద్దప్ప, కురువ గాదిలింగ, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు

## బండలాగుడుపోటీల్లో ప్రథమస్థానం

# పంచలింగాల వృషభరాజములు



**పగిడ్యాల, మార్చి 22,ప్రభాతవార్త :** పగిడ్యాల మండలం లక్ష్మాపురంలో ఉగాధి - రైతు సంబరాల్లో భాగంగా అఖిల భారత స్థాయిలో నిర్వహించిన నాలుగుపళ్ళ సైజు వృషభరాజముల విభాగ ం బండలాగుడు పోటీలను నందికొట్కూరు పురపాలకసంఘం వైస్ చైర్మెన్ యం రబ్బాని, మున్సిపల్ కౌన్సిలర్ యం.జాకీర్ బుధవారం ప్రారంభించారు. నంద్యాల భూషిగౌడు అధ్వర్యంలో వైకాపా నాయకుల సహాయసహకారంతో బండలాగుడు పోటీలను నిర్వహించారు. విజేతలకు దాతలు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ప్రథమస్థానంలో కర్నూలు మండలం పంచలింగాలకు చెందిన బైరపోగు వృషభరాజములు15 నిముషాల్లో 4250 అడుగుల దూరం బండలాగి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. గుడిపాడు, పి.రుద్రవరం గ్రామాలకు చెందిన రాగుల వెంకట్రామిరెడ్డి, యల్లగౌడు వృషభరాజములు 4127.8 అడుగుల దూరంలాగి రెండవ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా నాగులప్పలపాడు మండలం మద్దిరాల్ల ముప్రాల్ల పుచ్చకాయల శేషాద్రి చౌదరికి చెందిన వృషభరాజములు 4052 అడుగుల దూరంలాగి మూడవ స్థానంలో నిలిచాయి. లింగాపురం, ఇటికెనాలు జూటూరు చిన్నారెడ్డి, వీరన్న పల్లికి చెందిన వృషభరాజములు 3864 అడుగుల దూరం లాగి నాల్గవ స్థానంలో నిలిచాయి. ఎ. కోడూరు చాగంట నాగేశ్వరెడ్డికి చెందిన వృషభరాజములు 3809 అడుగులదూరం లాగి ఐదవ స్థానంలో నిలిచాయి. ఎస్ఎస్వి ట్రేడర్స్ మైమున్నా, మల్యాల, అటివప్ప త్తుమ్మల్ల రాజోలికి చెందిన చెందిన వృషభరాజములు 3716.10 అడుగుల దూరంలాగి 6వ స్థానంలో నిలిచాయి. బొల్లవరం శివ, అముదాలపాడు మంగలి మూగెన్న చెందిన వృషభరాజములు 3274 అడుగుల దూరం లాగి 7వ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. అత్మకూరు మండలం కరివేనకు చెందిన దారపనేని భాస్కరెడ్డికి చెందిన వృషభరాజములు 31 అడుగులు లాగి 8వస్థానంలో నిలిచాయి. వీపనగండ్ల మంగలి బాబు, చిన్న చెన్న య్యకు చెందిన వృషభరాజములు 9వ స్థానంలో నిలవగా రాయచోటి రామరాజు, ఖాదర్‌ఖాన్ కొట్టాల వృషభరాజములు 10వస్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.30,000లు, (దాతలు ఎంఎల్ఏ తొగురు అర్థర్, సతీమణి పాపులమ్మ, వివేక్ జయసందీప్, తొగురు నిహన్ అర్థర్) రెండవ బహుమతి రూ. 20,000లు ( దాతలు తాటిపాటు యం.మహబూబ్‌సాహెబ్ (రబ్బాని గ్రూప్ చైర్మెన్) మూడవ బహుమతి రూ. 15,000 లు (దాత హరిసర్వోత్తమరెడ్డి, కో-అపరేటీవ్ సొసైటీ చైర్మెన్ బ్రాహ్మణకొట్కూరు, దాత జయరాఘవనాయుడు బీరవోలు) నాల్గవ బహుమతి రూ 10,000లు ( దాతలు వెంకటరమణ నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ అద్యక్షడు, వైకాపా నాయకులు యర్రం.వెంకటరెడ్డి, ప్రాతకోట తెలుగు వెంకటేశ్వర్లు) ఐదవ బహుమతి రూ. 8,000లు (దాతలు లక్ష్మాపురం సమీన్, గానిగ మార్కొండ) 6వ బహుమతి రూ. 5,000లు (దాత ముగ్గు కోటయ్య) 7వ బహుమతి రూ. 4,000లు (దాత బైరపోగు సుంకన్న బ్రదర్స్ పంచలింగాల) 8వ బహుమతి రూ. 3,000లు (దాతలు : కుమార్ మొబైల్స్ నం దికొట్కూరు) 9వ బహుమతి రూ. 2,000లు (దాతలు : మల్యాల శంకరయ్య వైకాపా నాయకులు ) 10వ బహుమతి రూ. 1500లు (దాతలు : మసీదుల సుభాన్ ముస్లింమైనార్టీల నాయకులు ప్రాతకోట) వృషభరాజముల యజమానులకు దాతలు నగదు బహుమతులు దాతలు అందజేశారు. వాడాల రామనాయుడు. అబ్దుల్ కలామ్ వ్యాక్యాతలుగా వ్యవహరిం చారు. భోజన వసతి భూషిగౌడు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, వివిధగ్రామాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు. ఏలాంటి అవాంచనీయమైన సంఘటనలు జరగకుండా ముందుజాగ్రత్తగా ముచ్చుమర్రి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## వెంకాయపల్లె ఎల్లమ్మను దర్శించుకున్న తాలుక సిఐ



**కర్నూలు రూరల్,మార్చి 22,ప్రభాతవార్త :** వెంకాయపల్లె గ్రామ సమీపాన వెలసిన ఎల్లమ్మ అమ్మవారిని ఉగాది పర్వదినం పురస్కరించుకుని బుధవారం కర్నూలు తాలుక సిఐ రామలింగం కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తాలుక సిఐ రామలింగంకు వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థాన చైర్మన్ బేతం కృష్ణుడు సాదరంగా స్వాగతం పలికి శాలువా,పూలమాలతో సన్మానించి ఉగాది పంచాంగ పుస్తకం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సీతారామిరెడ్డి, ఆలయ పూజారులు ఎల్లరాజు,నారాయణ గోకారి,బాలు,దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్ సిబ్బంది ఉపాధి కూలి బాట

**మద్దికెర,మార్చి 22,ప్రభాతవార్త :** జానెడు పొట్ట కోసం గంటల తరబడి దుర్వాసన వెదజల్లినా తన వృత్తినే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న స్వచ్ఛభారత్ సిబ్బంది మండల కేంద్రంలో దాదాపు 20మందికిపైగా ఉన్నారు. గత కొన్ని నెలల నుండి వేతనాలు రాకున్నా పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. అయితే ఈ నెల 20న వేతనాల కోసం మండల అధికారి దగ్గరికి వెళ్లగా మీకు వేతనాలు ఇప్పటివరకు మంజూరు కాలేవు మా చేతిలో ఏమీ లేదని సదరు అధికారి చేతులెత్తేశారు. ఈ వృత్తిని నమ్ముకున్న మా జీవనం ఎలా అని ప్రశ్నించగా ఉపాధి హామీ పనులకు వెళ్లండని ఉచిత సలహా ఇవ్వడం జరిగిందని స్వచ్ఛభారత్ సిబ్బంది తెలిపారు. మొదటి నుండి ఉపాధి హామీ పనులకు వెళ్లి ఉంటే మా కుటుంబ జీవనం సాఫీగా జరిగేదని ఈ పని నమ్మకంతో నెలల పాటు పని చేసినా పైసా రాకుండ ఉందని వాపోయారు. అధికారుల నిర్లక్ష్యమో..పాలకుల నిర్లక్ష్యమో..తెలియడం లేదన్నారు. గతంలో కలెక్టర్ సందర్శించినప్పుడు మా గోడు చెప్పుకున్నా ఇప్పటివరకు జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే చేసేదేమీ లేక మంగళవారం ఉపాధి కూలీకి వెళ్లి మధ్యాహ్నం డ్యూటీకి రావడం జరిగిందని వారు తెలిపారు.

## ఘనంగా శ్రీలక్ష్మీనరసింహుడి గ్రామోత్సవం



**కొలిమిగుండ్ల, మార్చి 22, ప్రభాతవార్త :** స్థానిక నృసింహ కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసి ం హస్వామి గ్రామోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. శోభకృత్ నామ ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకొని గ్రామపెద్దల అధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేక పల్లకీలో అలంకరించి గ్రామపుర వీధుల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. అలయ ప్రధాన అర్చకులు బూడిదపాటి రాఘవయ్య స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో భక్తులు స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## 28న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

**దేవనకొండ,మార్చి 22,ప్రభాతవార్త :** మండల పరిధిలోని బండపల్లె గ్రామంలో శ్రీ సుంకులా పరమేశ్వరి దేవి దేవర సందర్భంగా ఈ నెల 28న మంగళవారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు పాలపల్లు సైజు (ఆరుపల్ల విబాగము) నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు,గ్రామస్తులు,భక్తబృందం తెలిపారు. మొదటి బహుమతి దాత సీమ నారాయణ కుమారుడు,సర్పంచ్ గొల్ల ఆంజనేయులు రూ.30,016లు,2వ బహుమతి దాత కీ.శే కుమ్మల గోవిందు కుమారుడు కుమ్మరి రాజశేఖర్ రూ.20,016లు,3వ బహుమతి దాత ఈడిగ నరసింహులు గౌడ్ రూ.10,016లు,4వ బహుమతి దాత మంగలి నర్సయ్య కుమారుడు మంగలి హనుమేష్ రూ.5 ,016లు అందచేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కుమ్మరి రామాంజనేయులు 6302996635ను సంప్రదించాలన్నారు.

## హనుమంతరావు చౌదరికి ఉగాది జాతీయ అవార్డు



**కర్నూలు న్యూసిటీ, మార్చి 22, ప్రభాతవార్త:** కర్నూలు జిల్లాకు చెందిన కళాకారుడు, టిడిపి సాం స్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు హనుమంతరా వు చౌదరి ఉత్తమ జాత య అవార్డు అందుకు న్నారు. ఉగాది సంద ర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన మందిరంలో ఉగాది పురష్కారాలు అందజేశారు. విశ్వకవి ఫౌండేషన్ అధ్యక్షులు డా.కళారత్న బిక్కి కృష్ణ అధ్వర్యంలో ఎం నరసింహప్ప ప్రిన్సిపల్ చీఫ్ కమిషనరు ఇన్కమ్ టాక్స్ కస్తూరి శ్రీనివాస్, జీవన్, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, రాజగోపాల్, వల్లంకొండ గురుమూర్తిల అధ్వర్యంలో ఉగాది జాతీయ పురష్కారాలు అందజేశారు. ఈసందర్భంగా జాతీయ పురష్కార గ్రహీత హనుమంతరావు చౌదరి మాట్లాడుతూ హైదరాబాద్‌లో జాతీయస్థాయి అవార్డు అందుకోవడం అదృష్టంగా భావిస్తున న్నట్లు తెలిపారు. కళాకారుడు నిరంతరం కళ కోసం జీవిస్తాడు ఇలాంటి పురష్కారాల వల్ల మరింత ప్రొత్సాహం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సతీమణ లక్ష్మీ పద్మ చౌదరి, సోదరి ఇందిరమ్మ, కూతురు గౌతమి ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



### ఘనంగా లక్ష్మమ్మ

## అవ్వ రథోత్సవం

**- లక్ష్మమ్మ అవ్వకు ప్రత్యేక పూజలు**

**- బందోబస్తు నిర్వహించిన పోలీసులు**

**బూదూరు(మంత్రాలయం),మార్చి 22,ప్రభాతవార్త:** మండల పరిధిలోని బూదూరు గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మమ్మ అవ్వ రథోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి.ప్రతి ఏటా ఉగాది పర్వదినం రోజున ఈ లక్ష్మమ్మ అవ్వ రథోత్సవం నిర్వహించడం ఈ గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది.ఈ పర్వదినం సందర్భంగా శ్రీ లక్ష్మమ్మ అవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఆకుపూజ,కుంకుమార్చన,మంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు.సాయంత్రం అశేష భక్తుల మధ్య గ్రామ పురవీధుల గుండా శ్రీ లక్ష్మమ్మ అవ్వ రథోత్సవం చేశారు.ఈ రథోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## శ్రీపండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ పంచాంగ శ్రవణం



**శ్రీశైలంప్రాజెక్టు,మార్చి22,ప్రభాతవార్త :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకోని శ్రీగిరిక్షేత్రంలో ఉదయం 10.00 గంటలకు ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకారమండపంలో దేవస్థాన అస్థాన సిద్దాంతి శ్రీపండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞచే రాజమండ్రివారిచే పంచాంగ శ్రవణం గావించారు.కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాదికారి సుద్దకుంట లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు వీరూపాక్షయ్యస్వామి, ఉభయదేవాలయాల ప్రధానార్చకులు,వేదపండింతులు,పలు విబాగాల అధికారులు,పలువురు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గోన్నారు. పంచాంగ శ్రవణం కంటే ముందు లోక కల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు,వేదపండింతులు సంకల్పాన్ని పఠించారు.ఈ సంకల్పంలో దేశం శాంతి సౌబాగ్యలతో విలసిల్లాలని, సకాలంలో వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని,జనులందరు అరోగ్యంగా ఉండాలని, జనులందరు ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ ఆర్చకులు,వేదపండింతుల సంకల్ప పఠనం చేసారు.తరువాత ఉత్సవమూర్తులకు,నూతన పంచాంగానికి కూడా పూజాదికాలు నిర్వహించారు.అనంతరం కార్యనిర్వహణదికారి దేవస్థానం తరుపున ఆస్థాన సిద్దాంతి శ్రీపండిత బుట్టేవీరభద్ర దైవజ్ఞ వారిని సత్కరించి పంచాంగ పఠానానికి ఆహ్వానించారు.తరువాత ఆస్థాన సిద్దాంతి శోభకృత్ నామ సంవత్సర విశేషాలను వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఈసంవత్సరం దేశమంతటా మంచి వర్షాలు కురుస్తాయని నదులన్ని పోంగిపోర్లుతాయాన్నారు.ఈ సంవత్సరం భారతదేశ ఖ్యాతి పెరుగుతుందన్నారు.అంతరిక్ష పరిశోదనలు విజయవంతం అవుతాయన్నారు.క్రిడారంగంలో అనేక విజయాలు లబిసా ్తయాని,పారిశ్రామికరంగం వృద్ధిలో ఉంటుందన్నారు.పర్యాటకరంగం కూడా అబివృద్దికరంగా ఉంటుందన్నారు.

## పగిడ్యాల మండలంలో వైభవంగా ఉగాదిపండుగ



**పగిడ్యాల, మార్చి 22,ప్రభాతవార్త :** శ్రీశోభకృత్ తెలుగుసంవత్సరాదైన ఉగాదిపండుగ బుధవారం పగిడ్యాల మండలంలో వైభవంగా జరిగింది. మండలంలోని నెహ్రూనగర్, పాతకొండ ప్రాగటూరు, పాత ముచ్చుమర్రి, కొత్త ముచ్చుమర్రి, వనములపాడు, అంజనేయనగర్, బీరవోలు, సంకిరేణిపల్లె, పగిడ్యాల, పాలమర్రి, లక్ష్మాపురం, లక్ష్మాపురం అంచవద్ద వెలసిన శ్రీఎల్లమ్మ అలయానికి సమీపగ్రామ ప్రజలు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పడమర ప్రాతకోట, తూర్పు ప్రాతకోట, గణపురం, రైతుపల్లె మొదలగు గామాల్లోని గ్రామదేవతలకు ప్రజలు మొక్కుబడులు చెల్లించారు. భక్తిశ్రద్దలతో అయాలకు వెళ్లిప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులు వృషభరాజములను అలంకరించుకుని భాజాభజంత్రీలతో ఊరేగింపుగా వెళ్లి అలయాలవద్ద పూజలు చేసి కాయకర్పూరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండుతున్న ఎండను సహితం లెక్కచేయకుండా అలయాలకు అత్యధిక సంఖ్యంలో మహిళలు రావడంతో కిక్కిరిసిపోయాయి. అయా గ్రామాల్లో సాయంత్రం పురోహితులు పంచాంగ శ్రవణం చేవారు.

## తాగునీటి ఎద్దడి తలెత్తకుండ చూస్తాం



**హొళగుంద,మార్చి 22,ప్రభాతవార్త :** వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండ చూస్తామని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చలవాది రంగమ్మ,ఉపసర్పంచ్ మీనాక్షమ్మ,పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్‌లు అన్నారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా 9వ వార్డు నందు మరియు సుంకులమ్మ దేవి ఆలయంలో చేతిపంపు మరమత్తులకు నోచుకోకపోవడంతో ఆలయానికి వచ్చిన భక్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల ఇబ్బందులను చూసి సర్పంచ్ చలవాది రంగమ్మ తనయుడు చలవాది పంపాపతి,పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్‌లు,ఉప సర్పంచ్ భర్త దొడ్డబసప్పలు కలిసి వెంటనే మరమత్తులు చేయించారు. దీంతో 9వ వార్డు ప్రజలు,సుంకులమ్మ దేవాలయానికి వచ్చే భక్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. వేసవి కాలం కావడంతో గ్రామంలో ఎక్కడ కూడా చేతిపంపులు నిరుపయోగంగా ఉండకుండ ఎప్పటికప్పుడు చేతిపంపులు మరమత్తులు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు.

## ఉగాది సందర్భంగా కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు



**నందికొట్కూరు,మార్చి 22,ప్రభాతవార్త:** శ్రీ శోభకృత నామ సంవత్సర ఉగాది పండుగను పురష్కారించుకొని పట్టణంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం శ్రీసుంకులాపరమేశ్వరీదేవి, సవారమ్మ ఆలయాల వద్ద ఉదయం నుండే వేలాది మంది భక్తులు బారులు తీరి అమ్మవార్లకు నైవేధ్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానికి భక్తుల కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భంధోబస్తు నిర్వహించారు. సవారమ్మ గుడిలో పట్టణ మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

## శ్రీ శోభకృత్ నామ పండుగ సందర్బంగా కిటకిటలాడిన దేవాలయాలు



**హొళగుంద,మార్చి 22,ప్రభాతవార్త :** మన సంస్కృతి సంబరాలను గుర్తు చేస్తూ వచ్చిన ఉగాది పండుగ అందరి జీవితాల్లో ఆనందం,ఐశర్యం తీసుకురావాలని ఆ భగవంతుడిని భక్తులు వేడుకున్నారు. ఉగాది పచ్చడి లాగా షడ్రుచుల సమ్మేళనం మన జీవితం అన్నారు. మంచి,చెడును సమన్వయంతో స్వీకరిస్తూ ప్రతిఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవుడిని వేడుకున్నారు. శ్రీ శుభకృత్ నామ సంవత్సరం మధురమైన క్షణాలను అందించాలని భక్తులు కోరుకున్నారు. తీపి,చేదు కలిసిందే జీవితం..కష్టం..సుఖం..తెలిసిందే జీవితం..ఇలాంటి ఉగాది పండుగలు మరెన్నో జరుపుకోవాలని ఆ దేవున్ని వేడుకున్నారు. పండుగ సందర్భంగా భక్తులు దేవాలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించి స్వామి వార్లకు కుంకుమార్చన,ఆకుపూజ,మహామంగళారతి తదితర విశిష్ట పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పండుగ సందర్భంగా మండలంలోని అన్ని దేవాలయాలు కిటకిటలాడాయి.

## 'సాంప్రదాయబద్ధంగా శోభకృత్‌నామ ఉగాది వేడుకలు'

**- అలయాల్లో ప్రత్యేక పూజలతో భక్తుల రద్దీ**



**కొలిమిగుండ్ల, మార్చి 22, ప్రభాతవార్త :** నూతన తెలుగు సంవత్సరం శోభకృత్ నామ ఉగాది పర్వదిన వేడుకలను బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రముఖ అలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే నూతన వస్త్రాలను ధరించి సా ప్రదాయ పద్ధతుల్లో ఉగాది పచ్చళ్లు, పూజలు తదితర కార్యక్రమాలను చేపట్టిన ప్రజలు సాయంకాలం అలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లోని ఆలయాల్లో వేద పండితులు సాంప్రదాయ పద్ధతుల్లో పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. మండలకేంద్రమైన కొలిమిగుండ్లలోని కుంటెమ్మ దేవత అలయం, సాయిబాబా ఆలయం, మీర్జాపురంలోని అంజనేయస్వామి అలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలో అలయ ప్రదక్షణలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రైతులు కొత్త శోభకృత్ నామ సంవత్సరంలో కొత్త సాగును ప్రారంభించి పొలాన్ని దున్నారు. వివిధ గ్రామాల్లోని అలయాల్లో ప్రత్యేక పూజలతో భక్తుల రద్దీ కొనసాగింది. నూతన తెలుగు సంవత్సరం ఉగాదిని పురష్కరించుకొని గోపూజ, ఉగాది వేడుకలను నిర్వహించారు. మొత్తం మీద నూతన శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు.

## వైభవంగా దుర్గాదేవి కుంభోత్సవం



**ఆలూరు రూరల్,మార్చి 22,ప్రభాతవార్త :** ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో దుర్గాదేవి కుంభోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం 9గంటలకు ఏఎస్ఐ సురేష్ భార్య అన్నపూర్ణమ్మ తమ ఇంటి నుండి దుర్గాదేవి దేవాలయం వరకు కుంభంను మోసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కుంభోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్,తిలక్,ఇందుమతి, కుశల్ కుమార్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తాళిబొట్టు బహుకరణ చేసిన జడ్‌పిటిసి కిట్టు



**దేవనకొండ,మార్చి 22,ప్రభాతవార్త :** మండలంలోని పి కోటకొండ గ్రామానికి చెందిన కున్నూరు రంగమ్మ,లేట్ కున్నూరు బొజ్జన్నల కుమార్తె వివాహం నిమిత్తం తాళిబొట్టును జడ్‌పిటిసి కిట్టు, యస్వంతి దంపతులు బుధవారం బహుకరించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి కిట్టు మాట్లాడుతూ పెళ్లి కార్యంలో భాగంగా తాళిబొట్టు ఇవ్వడం నా అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. నూతన వధూవరులు సుఖసంతోషాలతో నిండునూరేళ్ల ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పి కోటకొండ మీనిగ కృష్ణ,సంజీవ,గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్మారక వారాన్ని జయప్రదం చేయండి



**నందికొట్కూరు,మార్చి 22,ప్రభాతవార్త:** విప్లవ వీరులు దేశమాత ముద్దుబిడ్డలైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవల 92వ అమరత్వ స్మారక వారాన్ని జయప్రదం చేయాలని పిడిఎస్‌యు డివిజన్ ప్రధాన కార్యదర్శి పి.మర్రిస్వామి పిలుపు నిచ్చారు. బుధవారం స్తానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు దేశంలో ఫాసిస్టు శక్తుల ఉనికిడి పెరుగుతున్నది, నేడు విద్యను కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేడానికి మోడీ ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఈ విద్యా విధానం విద్యారంగానికి పెను ప్రమాదమన్నారు. ఈ నెల 23 నుండి 29 వరకు జరుగు అమరత్వ స్మారక సభలు, ర్యాలీలు, కాగడాల ప్రదర్శనలు విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందని విద్యార్థులుచ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శిలు శ్రీరామ్, గణేష్, రాజు,మస్తాన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.